# మైక్రో-క్రెడిట్ - SKU



ఇవాళ ఇక్కడ బోస్టన్ లో AID-MIT పదవ వార్షికోత్సవం జరుపుకుంది. ఆ సందర్భం గా చెన్నై నుండి Dr.బాలాజీ సంపత్, కల్పన కరుణాకరన్ లు వచ్చి ఇండియా లో AID కార్యకలాపాల గురించి వివరించారు. బాలాజీ పూర్తి ప్రసంగం నేను వినలేదు కానీ, నాకు ఎంతో ఆసక్తికరం అనిపించినది కల్పన ప్రసంగం.

కల్పన MALAR అనే సంస్థ కో-ఆర్డినేటర్. ఆమె అధ్వర్యం లో ఈ సంస్థ స్త్రీ వికాసం, వారి Self-Help-Groups (SHGs) దిశలో, ఇంకా ఆమె రూపొందించిన Aarogiya iyakkam అనే పథకం తమిళనాడు ప్రభుత్వం తో కలిసి పని చేస్తున్నాయి. క్రితం సంవత్సరం UN ఈ Aarogiya Iyakkam పథకాన్ని ప్రపంచం లో అత్యుత్తమ 10 పథకాలలో ఒకటిగా గుర్తించింది. ఆమె ఇంకా Tamil Nadu Science Forum (TNSF) మరియూ All India people's Science Network (AIPSN) లతో కూడా పనిచేస్తున్నారు.

ఈ సంవత్సరం నోబెల్ శాంతి బహుమతి బంగ్లాదేశ్ కి చెందిన మహమద్ యూనస్ మరియూ ఆయన అక్కడ మొదలెట్టిన Micro-credit ఆలోచన ఆధారం గా నడుస్తున్న గ్రామీణ బాంక్ లకి సమ్యుక్తం గా దక్కింది.

కల్పన ఈ Micro-credit గురించి PHd చేస్తున్నారు. ఆ సందర్భం గా ఆమె ప్రసంగం గురించిన flier చూసి ఏమి చెపుతారో అనే ఆసక్తి తో వెళ్ళాను. ఆమె చెప్పటం తాను ఈ Micro-credit అనేది ఇప్పుడే భారతదేశం లో కూడా బాగా పుంజుకుంటోంది, అయితే ఈ విధానం అందరూ అనుకునేంత రోజీ సీన్ కాదు అని. పైగా శ్రోతలలో కొందరు అన్నట్టు ఈ Micro-credit అనేది కరప్షన్ ని పూర్తిగా ఎదుర్కొనే సాధనం కూడా కాదు అని.

అసలు ఈ Micro-credit అంటే, పది మంది మహిళలు కలిసి తమ జీవితాలు బాగు పరుచుకోవాలి అని నిర్ణయించుకొని ఆ దిశగా ఒక సవ్యమైన అడుగు వేయటం. ప్రతి మహిళ ఒక పదో లేక మరెంతో రూపాయలు వారి ఉమ్మడి పద్దు కి జమ కడతారు. వారిలో డబ్బు అవసరం ఎవరికైనా కలిగినప్పుడు అ పద్దు లోంచి అప్పుగా తీసుకొని తిరిగి దానికి జమ చేస్తారు. అయితే ఈ పథకం మన బాంకుల లోన్ పథకాల వంటిదే కదా అని మీరు అడగవచ్చు.

బాంక్ లు ఇచ్చే డబ్బు మనం ఆ బాంక్ లో దాచుకున్న డబ్బు నుండే మనకి ఇచ్చినప్పటికీ మనకి అంత ప్రత్యక్షంగా ఆ విషయం అర్థం కాదు. అదే నేను, మా ఇంటి చుట్టుపక్కల వుండే పది మంది తో కలిసి దాచిన డబ్బు లోంచి అప్పు తీసుకున్నప్పుడు ఆ డబ్బు ఎవరిది అనేది నాకు ఖచ్చితం గా తెలుసు. కనుక నేను నెల నెల 10 రూపాయల చొప్పున జమ చేసి పెంచిన పది వేల పద్దు లోంచి మా పక్కింటావిడ ఒక వెయ్యి రూపాయలు అప్పు తీసుకొని దానిని తిరిగి ఇవ్వకుండా ఏవో వంకలు చెపుతూ తను మాత్రం ఇంట్లో పరమాన్నాలు చేసుకుంటుంటే నేను ఊరుకుంటానా? ఆమె తీసుకున్న డబ్బు లో నా భాగం కూడా వుంది కనుక నేను ఆమె ఆ డబ్బు తిరిగి జమ చేసేలా చూస్తాను. అదే విధం గా నేను అప్పు తీసుకున్నట్టు అయితే, నా పక్కింట్లోనే నాకు అప్పు ఇచ్చినవాళ్ళు వుంటే ఒక రకమైన భయం, బాధ్యత తో ఆ డబ్బు తిరిగి ఇవ్వటానికి ప్రయత్నిస్తాను.

ఈ రకమైన సోషల్ ప్రెషర్ వలన అప్పు తీసుకున్న వాళ్ళు ఆ అప్పుని తిరిగి చెల్లించటం 90% ఈ Micro credit అనే దానిలో వుంటుంది. బాంక్ లు, ప్రభుత్వ పథకాలూ అప్పులు వసూలు చేయటానికి పడే కష్టాలు ఈ సగటు మహిళలు రోజూ తమలో తాము పడుతూ చివరికి అందరూ ఒక రకమైన డిసిప్లిన్ తో ఆ బకాయి తీర్చేలా చూసుకుంటారు.

అయితే, కల్పన చెప్పటం పైకి వినటానికి ఈ పథకం అద్భుతం గా అనిపించినప్పటికీ, ఆ గ్రూప్ లతో కలిసి పని చేసినప్పుడు ఈ రకమైన అప్పు తీర్చాలనే బధ్యత ఒకోసారి మోయలేనంత బరువుని ఈ మహిళల మీద మోపి, వాళ్ళు మొత్తానికి దాని నుండి బయటకి వచ్చేసేలా చేస్తోంది అని! ఆంధ్రప్రదేశ్ లో గత కొద్ది సంవత్సరాలలో ఎంతో మంది మహిళలు ఈ రకమైన ఒత్తిడిని తట్టుకోలేక, అప్పు తీర్చలేని అవమాన భారం మోయలేక ఆత్మహత్యలు చేసుకున్నారు అని చెప్పారు. ఈ వార్త నేను ఎక్కడా పేపర్లలో చదివిన గుర్తు లేదు. మరి ఆ వార్తలు మన పేపర్ల దృష్టికి రాలేదేమో!

ఇప్పుడు బాంక్ లు కూడా ఈ Micro credit పద్ధతి లాభసాటి పద్ధతి అని గ్రహించి వారు కూడా ఈ సంఘాలకి సాయం చేయటానికి ముందుకు వస్తున్నయిట భారతదేశం లో.

ఈ విషయం కూడా వినటానికి ఎంతో ప్రోత్సాహకరం గా అనిపించినప్పటికీ, దీని వెనుక బాంక్ ల స్వార్థ ప్రయోజనాల గురించి ఆమె వివరించారు. ఈ SHG లు అన్నీ దాదాపు ఇప్పుడు మహిళలతో నిండినవి. ఈ మహిళలు అతికష్టం మీద పది పరకా కలిపి ఈ బాంక్ లలో SB ఎకౌంట్ మాదిరి ఎకౌంట్ లు మొదలుపెట్టేలా బాంక్ లు చేస్తున్నాయి. వారిని లోన్ కోసం అర్జీలు పెట్టుకొమ్మని ప్రోత్సహిస్తున్నాయి. ఆ ప్రోత్సాహం తో ఈ గ్రూప్ లు ఏదైనా ఒక పథకం తాలూకు ప్రపోజల్ తో లోన్ కి అర్జీ పెట్టుకున్నప్పుడు.. ఆ బాంక్ లు తమ అసలు రంగు చూపిస్తున్నాయి.

మన భారత దేశం లో తీసుకున్న అప్పు తీర్చటం అదీ బాంక్ అప్పుని తీర్చటం అనేది చాలా తక్కువ. మన బాంక్ వ్యవస్థ ఇందిరాగాంధీ పుణ్యమా అని ఈ విధమైన ఋణబారాన్ని ప్రభుత్వం నెత్తిన వేసి చేతులు దులుపుకుంటున్నాయి. అయితే ఈ మధ్య వచ్చిన కొన్ని మార్పుల వలన ఈ బాంక్ లు కూడా అదివరకు వున్నంద ఉదాసీనం గా అప్పుల వసూలు గురించి వుండటం లేదు.

ఎక్కడ అయితే ఈ మహిళా గ్రూప్ లు పనిచేస్తున్నాయో అక్కడి బాంక్ లు ఆ మహిళల కుటుంబాలలో ఎవరైన తమకి పాత బాకీలు వున్నారేమో పాత చిట్టాలు తిరగేసి చూస్తున్నారు.

ఇవాళ నేను, నా స్నేహితురాళ్ళు ఒక పది మందీ కల్సి ఒక బిజినెస్ ప్లాన్ తో బాంక్ ని అప్పు అడగటానికి వెళ్ళాం. కానీ మా గ్రూప్ లోని కమల వాళ్ళ మావగారు ఎప్పుడో పదహారేళ్ళ క్రితం మేకలని కొనటానికి ఒక రెండువేలు అప్పు తీసుకొని ఆ బాంక్ కి ఆ అప్పు ఎగవేసారు అనుకోండి. ఆయన పోయారు అప్పుడే ఆ బాంక్ ఆ డబ్బు కి నీళ్ళు వదిలేసుకుంది. కానీ ఇవాళ మేము అంతా కలిసి అప్పుకోసం వెళ్ళినప్పుడు ఆ పదహారేళ్ళ నాటి అప్పు రెండువేలు ఇవాల్టికి వడ్డీ తో కలుపుకొని పదివేలు అయింది.. ఆ పదివేలు కనుక కమల ఇవాళ బాంక్ కి కట్టేస్తే మాకు మేము ఇవాల్టి బిజినెస్ కోసం అడిగిన డబ్బు అప్పు గా ఇవ్వటానికి ఏ విధమైన అభ్యంతరమూ లేదు అంటున్నారు.

అంటే కమల మా గ్రూప్ లో వుంటే తను ఆ బాంక్ అప్పు తీర్చేదాకా మా పథకం ముందు సాగదు. ఒకవేళ అమె దగ్గర నగో, భూమో వుంటే దానికి కుదవ పెట్టో లేక మరొకరి దగ్గర అప్పు చేసో ఆ డబ్బు ఆమె బాంక్ కి కట్టగలిగితే మాకు మేము అడిగిన డబ్బు చేతికి వస్తుంది. కానీ ఆమె ఆ డబ్బు కట్టలేకపోతే? ఏం చేయగలదు? మేము ఏం చేయగలం? మేము కలిసి కూడబెట్టిన డబ్బు ఆమె అప్పు తీర్చటానికి వాడగలమా? లేక మా అభివృద్ధి కి అడ్డం గా వున్న కమల ని మా గ్రూప్ నుండి వెళ్ళిపొమ్మని అడుగుతామా? సహజం గా ఆ రెండోదే చేస్తాము. దాని వలన నష్టపోయేది ఎవరు? ఈ Selh-help అనే ఆలోచన కాదూ?

శ్రోత్రలలో ఒకావిడ అడిగారు.. ఏమీ మరి ఇండియా లో ఇంక బాంక్ లు లేవా ఆ బాంక్ కాకపోతే మరొక బాంక్.. వీళ్ళు ఒక డిసిప్లిన్ వున్న గ్రూప్ అంటున్నారు కదా ఏ బాంక్ అయినా వీళ్ళకి వెండి పళ్ళెం లో అప్పు ఇవ్వాలి కదా? అని.

నిజమే ఈ మహిళలకి అప్పులు వెంటనే తీరుస్తారు, తీర్చగలరు అనే ప్లాన్ వుంది. కానీ బాంక్ లకి కూడా తమ పాత బాకీలు వసూలు చేయవలసిన బాధ్యత వుంది.. వసూలు చేసిన మొత్తం ని బట్టి వాళ్ళకి వచ్చే ప్రమోషన్ లు వున్నాయి, లాభాలు వున్నాయి. అందుకోసం ఏం చేస్తున్నాయి ఈ బాంక్ లు? ఒక గ్రామం లో 10 బాంక్ ల తాలూకు బ్రాంచ్ లు వున్నాయి అనుకోండి. ఇవాళ నేను ఆంధ్రా బాంక్ దగ్గరకి అప్పు కోసం వెళ్ళాను.. వాళ్ళు కమల కుటుంబం వున్న బాకీ గుర్తు చేసి ఒక మోకాలు అడ్డు వేసారు. అంతటి తో వాళ్ళు ఊరుకోవటం లేదు. ఈ అప్పు కోసం దరఖాస్తు పెట్టుకున్న మహిళలు అందరూ వాళ్ళకి ఎకౌంట్ వున్న ప్రతీ బాంక్ నుండీ Not Defaulter సర్టిఫికెట్ కూడా తీసుకురమ్మంటున్నారు. ఈ విధం గా ఈ బాంక్ లు కూడకట్టుకొని తమ అప్పులు వసూలు చేసే పని మొదలు పెట్టాయి. ఇలాంటి సందర్భం లో నేను ఎక్కడికి వెళ్ళగలను?

* * *

నాకు ఆసక్తికరం అనిపించిన మరొక విషయం కల్పన చెప్పారు. ఆమె ఒక గ్రూప్ తో కలిసి పని చేస్తుండగా ఒక ఇరవై లలో వున్న Ms.X ని కలిసారుట. ఆమెకి 8 నెలల పాప. Ms.X కి ఎన్నో గర్భస్రావాల అనంతరం పుట్టిన మొదటి పాప ఆ పాప. మరి ఈ పాప ఎలా పుట్టి బతికిందీ అంటే ఆమెకి గర్భస్రావాలు అవటానికి కారణం ఆమె చెప్పారుట. ఆమె భర్త తాగి వచ్చి గొడవ పెట్టుకున్నప్పుడల్లా ఈమెని చితకబాదేవారుట. ఆ సమయం లోనే ముందటి గర్భస్రావాలు జరిగాయిట. ఈ పాప పుట్టే మూడు నెలల క్రితం ఆ వీధి లోని మహిళలు అంతా కలిసి ఒక Micro credit గ్రూప్ మొదలెట్టారుట. ఎంతో కొంత ప్రతీ నెలా డబ్బు వెనకేస్తున్నారుట. ఈమెని ఆమె భర్త కొడుతుంటే, ఈమె రోదనలు విన్న పక్కింటామె మిగిలిన మహిళలని వెంటబెట్టుకొని వచ్చి ఆమె భర్త ని ఫిజికల్ గా అడ్డుకొని ఆమెని అతని నుండి రక్షించారుట.

ఆ నెల తాము అంతా కలిసి దాచుకున్న డబ్బు తో ఆమెకి ఆమె పుట్టింటికి బస్ టికెట్ కొని బిడ్డ పుట్టేంత వరకూ రావద్దని ఆమెకి నచ్చచెప్పి ఆమె కి కొంత డబ్బు ఇచ్చి బస్ ఎక్కించారుట.

ఇంక ఈ పతిపుంగవుని కి మొత్తం ఇరవై మందీ కలిసి పాఠం మొదలు పెట్టారుట. నువ్వు నీ భార్య ని ఇంట్లో పడేసి కొడితే మేమంతా కలిసి నిన్ను వీధిలో పడేసి కొడతాము అని బెదిరించి అతనిలో

ఒక భయం, తన భార్య చితక్కొడితే నోరు మెదపకుండా పడి వుండేది కాదు అని తెలిసేలా చేసారుట.

మరి అలా భయపెట్టి చేయించిన కాపురం ఇంకా సాగుతోందా అని కల్పన ఆ మహిళని అడిగారుట.

దానికి ఆమె ఇచ్చిన సమాధానం.. సాగుతోంది.. ఇప్పటికీ అతను తాగి వస్తాడు.. గొడవ పెరిగితే నన్ను కొడతాడు కానీ.. అదివరకులా పశువు లా ఒళ్ళు తెలీని నిర్లక్ష్యం లేదు.. పైగా అంటాడు.. నిన్ను కొడితే నీ వెనకాల 20 మంది మాఫియా వుంది వాళ్ళు నన్ను బతకనివ్వరు అని!

ఈ చితక్కొట్టుకోవటం అనేది నాకు అర్థం కానీ, అంగీకరించలేని విషయం.. కానీ.. ఈ సందర్భం లో ఆమెకి ఉపయోగపడింది.

About Ms.Kalpana Karunakaran

---

మీ సలహాలు, సూచనలు, అభిప్రాయాలు రచయిత్రి SKU కి తెలియపరచండి.
మీ అభిప్రాయాలు రచ్చబండ లో తెలియచేయండి